రక్తదానంతో ప్రాణదానం

● మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ● బనగానపల్లెలో రక్తదాన శిబిరం



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా బనగానపల్లెలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మరొకరి జీవితంలో వెలుగు నింపుతుందన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలువాలని కోరారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు అనేక పదవులు ఇచ్చారన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన ఘనత నందమూరి తారకరామారావుదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, ఉపసర్పంచ్ బురానుద్దీన్, మౌళీశ్వరరెడ్డి, ఇస్మాయిల్‌ఖాన్, తిరుమలయ్య, నాగేంద్రారెడ్డి, కృష్ణానాయక్, పూలకలాం, భూషన్న, దివాకర్‌రెడ్డి, జంగంశెట్టి, ప్రసాద్, ఖాదర్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న మంత్రి బీసీ

తెలుగువారి ఆత్మగౌరవం ఎన్టీఆర్

టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల కల్చరల్, జనవరి 18: తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ పేద ప్రజల కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల వారి కోసం నిస్వార్థంగా పనిచేసి పేదల గుండెల్లో నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు బాబన్, జిల్లెల్ల శ్రీరాములు, డాక్టర్ రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న అభిమానులు, నాయకులు

ముగ్గుతో ఎన్టీఆర్ చిత్రం


డోన్ పట్టణానికి చెందిన ఆర్టిస్టు హరి ఎన్టీఆర్‌కు తనదైన శైలిలో నివాళులర్పించారు. పట్టణంలోని న్యూ మధు ఫంక్షన్ హాలు వద్ద ఖాళీ స్థలంలో రంగు రంగుల ముగ్గుతో ఎన్టీఆర్ చిత్రాన్ని ముగ్గు రూపంలో వేశారు. ఈ ఎన్టీఆర్ ముగ్గు ఎంతగానో ఆకట్టుకుంది. టీడీపీ యువ నాయకుడు మన్నే గౌతమ్ రెడ్డి తదితరులు ఆర్టిస్టు హరిని అభినందించారు.

- డోన్ రూరల్ (ఆంధ్రజ్యోతి)



ముగ్గుతో వేసిన ఎన్టీఆర్ చిత్రం

108 సిబ్బందికి తీపి కబురు





● వేతనం రూ.4 వేలు పెంచిన ప్రభుత్వం

● ఉమ్మడి జిల్లాలో 283 మందికి లబ్ధి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 18(ఆంధ్రజ్యోతి) : రహదారి ప్రమాదాల్లో బాధితులకు సత్వర ప్రాథమిక చికిత్స అందిస్తున్న 108 వాహన సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. సమాజంలో ఉత్తమ సేవలు అందిస్తున్న 108 సిబ్బంది వేతనాలు పెంచింది. ఎన్నో సంవత్సరాలుగా అరకొర జీతాలతో పని చేస్తున్న 108 సిబ్బందికి రూ.4 వేలు చొప్పున పెంచుతూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో 108 వాహన సిబ్బంది తమ వేతనాలు పెంచాలని పలుమార్లు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. గత ఏడాది ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి నేతలు 108 సిబ్బందికి ఇచ్చిన మాట మేరకు వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లకు తమ కోరిక ఫలించిందని ఆనందిస్తున్నారు.

కష్టం గుర్తించిన కూటమి ప్రభుత్వం

నంద్యాల జిల్లా పరిధిలోని 30 వాహనాల్లో 150 మంది సిబ్బంది, కర్నూలు జిల్లాలోని 27 వాహనాల్లో 133 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి 108 వాహనంలో ఒక ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్), పైలెట్ (డ్రైవర్) పని చేస్తున్నారు. ప్రస్తుతం వారు పని చేస్తున్న సర్వీసు ఆధారంగా స్లాబుల వారీగా సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. ఇవి వారి శ్రమకు చాలీచాలని వేతనాలే. వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాసటగా నిలిచారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు 108 వాహన సిబ్బంది ప్రయోజనార్థం వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు 2017-18లో జీవో నెం 49ను తీసుకొచ్చారు. ఈ జీవో అమలు కాకముందే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎం జగన్ ఈ జీవోను నిర్లక్ష్యం చేశారు. తిరిగి టీడీపీ అధికారంలోకి రావడంతో 108 వాహన ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. వేతనాలు పెంచాలని, వైసీపీ హయాంలో రద్దు చేసిన జీవోను పునరుద్ధరించాలని 108 వాహన సిబ్బంది, ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు సీఎంను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగులకు రూ.4 వేల చొప్పున వేతనాలు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు.



108 వాహనంలో బాధితులను తరలిస్తున్న దృశ్యం(ఫైల్)



అందరి సహకారంతోనే సాధ్యం



రాష్ట్రంలోని 108 వాహన సిబ్బంది, రాష్ట్ర యూనియన్ ప్రతినిధుల సహకారంతో వేతన పెంపు సాధ్యమైంది. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి వన్నెతెచ్చేలా పనిచేస్తాం. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతాయనే నమ్మకం కలిగింది.

-రాజేష్, కర్నూలు జిల్లా యూనియన్ అధ్యక్షుడు

సంతోషంగా ఉంది



108 వాహన సిబ్బందికి వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. నిబద్ధతతో పనిచేస్తున్న ఉద్యోగులను కూటమి ప్రభుత్వం గుర్తించి అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహం ఎన్నో కుటుంబాలకు ఆసరా అవుతుంది.

- శేషయ్య, నంద్యాల జిల్లా యూనియన్ అధ్యక్షుడు

మరింత బాధ్యతగా పనిచేస్తాం



సమాజసేవలో భాగస్వాములైన 108 వాహన సిబ్బందిని ఎన్డీయే ప్రభుత్వం గుర్తించింది. రూ.4 వేలు వేతనం పెంచడంతో బాధ్యత మరింత పెరిగింది. ప్రభుత్వానికి, సంస్థకు మంచి పేరు తెచ్చేలా విధులు నిర్వహిస్తాం.

-జీవన్, నంద్యాల జిల్లా యూనియన్ జనరల్ సెక్రటరీ

అందరి సహకారంతో స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి బీసీ జనార్ధనరెడ్డి

కోవెలకుంట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని రోడ్లు భవనాలు మౌలిక వసతులు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి పేర్కొన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ -స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రమంత్రి బీసీ జనార్ధనరెడ్డి హాజరై ప్రారంభించారు. ముందుగా కోవెలకుంట్ల చేరుకున్న మంత్రికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పాండురంగ స్వామి దేవాలయం ఆవరణలో ఉన్న చెత్తను స్వయంగా ఎత్తి తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాండురంగ దేవాలయం నుండి సంత మార్కెట్ మీదుగా గ్రామ పంచాయతీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్కిల్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నాయకులతో కలిసి మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములలై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మంత్రి అందరి చేత ప్రమాణం చేయించారు. అక్కడ నుండి గ్రామ పంచాయతీ కార్యాలయం చేరుకుని టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. స్థలం లేని వారికి నిరుపేదలకు స్థలం, ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, బీవీ ప్రసాదరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్ఏ గఫూర్, శ్రీధర్‌రెడ్డి, ధనుంజయుడు, అర్జున్‌రెడ్డి, గుల్లదుర్తి సుదర్శన్‌రెడ్డి, వల్లంపాటి సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, బాలరాజు, బుచ్చన్న, గజ్జల హుసేనయ్య, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఓ. రాంభూపాల్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగం కండి -కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, కమిషనర్, చైర్‌పర్సన్

నంద్యాల (కల్చరల్), జనవరి 18: మన ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణమంతా తిరిగి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నివాస ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్‌స్టాపులు, రైల్వేస్టేషన్లు, పరిశ్రమలు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుండి మున్సిపల్ టౌన్ హాల్ వరకు జరిగిన భారీ ర్యాలీ కార్యక్రమానికి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ రజియాసుల్తానా, డిపో మేనేజర్ గంగాధర్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, చైర్‌పర్సన్ మాబున్నిసా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నాపరాతి డిపో యజమానులపై చర్యలు : ఆర్డీవో

రిజర్వాయర్ ఆక్రమిత స్థలాలను పరిశీలించిన ఆర్డీవో



రిజర్వాయర్ ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో నరసింహులు

అవుకు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్‌ను ఆక్రమించి నాపరాతి డిపోలను ఏర్పాటు చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డోన్ ఆర్డీవో నరసింహులు అధికారులను ఆదేశించారు. ఈనెల 4వతేదీన ఆంధ్రజ్యోతిలో ఆక్రమణలో అవుకు రిజర్వాయర్ కథనం ప్రచురితమైంది. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. శనివారం ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డితో కలసి రిజర్వాయర్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న నాపరాతి డిపోలను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నాపరాతి డిపోల యజమానులు రిజర్వాయర్ ఆక్రమించటమే కాక, నాపరాయి నుంచి వచ్చే వేల మెట్రిక్ టన్నుల వేస్టేజీని రిజర్వాయర్‌లో డంప్ చేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో రిజర్వాయర్‌లో నీటి నిల్వ శాతం తగ్గిపోతుందన్నారు. ఈనెల 7, 8, తేదీల్లో చెర్లోపల్లె గ్రామపంచాయతీ అధికారులు నాపరాతి డిపోల యజమానులు 15 మందికి నోటీసులు ఇచ్చారన్నారు. ఇంకా మరో ఇద్దరు డిపోల యజమానులకు నోటీసులు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటి వరకు ఆక్రమణదారుల్లో చలనం లేదన్నారు. దీంతో స్వయంగా పరిశీలించేందుకు వచ్చామన్నారు. సర్వే నెంబర్ల ఆధారంగా ఎస్సార్బీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తారన్నారు. నాపరాతి డిపోల యజమానులు రిజర్వాయర్ ఆక్రమిత స్థలాలను ఖాళీ చేసి డంప్ చేసిన వేస్టేజీని తీసివేయాలన్నారు. లేకుంటే నాపరాతి డిపోల యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుల వివరాలు అందించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సార్బీసీ, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి రిజర్వాయర్ స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంగళ్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

టీజీ ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఈగా శివప్రసాద్‌రెడ్డి



నంద్యాల, జనవరి 18, (ఆంధ్రజ్యోతి) : నంద్యాల తెలుగు గంగ ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఈగా ఎస్. శివప్రసాద్‌రెడ్డి శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనకు ఆ శాఖ ఈఈలు, డీఈఈలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన ఆ శాఖ ఈఎన్‌సీ అడ్మినిస్ట్రేషన్ విజయవాడలోని విజిలెన్సు విభాగంలో ఈఈగా పనిచేస్తుండగా.. ప్రభుత్వం తాజాగా ఎస్ఈగా పదోన్నతి కల్పించి ఇక్కడికి కేటాయించారు. ఎస్ఈగా శివప్రసాద్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడంతో ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేసిన సుబ్బరాయుడు తన పాత స్థానమైన ఎస్ఆర్‌బీసీ కోవెలకుంట్ల ఈఈగా కొనసాగనున్నారు. అనంతరం నూతన ఎస్ఈ మర్యాదపూర్వకంగా కలెక్టర్, జేసీలను కలిశారు.

ఎస్‌డీపీవోగా మందా జావలి అల్ఫాన్స్

నంద్యాల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ డివిజన్ ఎస్‌డీపీవోగా మందా జావలి అల్ఫాన్స్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఏఎస్పీలను బదిలీ చేసిన విషయం విదితమే. ఆ బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లాలో పని చేస్తున్న మందా జావలి అల్ఫాన్స్‌ను నంద్యాల జిల్లాకు బదిలీ చేసింది. దీంతో ఆమె నంద్యాల సబ్ డివిజన్ ఎస్‌డీపీవోగా పూర్వ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను 2022 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారినని అన్నారు. శిక్షణ అనంతరం తనకు నంద్యాల జిల్లా కేంద్రంలో సబ్ డివిజన్ ఎస్‌డీపీవోగా పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. ఎస్‌డీపీవోగా తన పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు కృషి చేస్తానన్నారు. ఒక మహిళా పోలీస్ అధికారిగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ నేరాల నియంత్రణకు కృషి చేస్తామని చెప్పారు. అలాగే ప్రజలకు ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చని ఆమె తెలిపారు



బాధ్యతలు స్వీకరించిన నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మందా జావలి అల్ఫాన్స్


డబుల్ ఇంజన్ సర్కారుతో

అభివృద్ధి పరుగులు

- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి

7

తుంగభద్ర తీరం సాహిత్యం



మనసును ముట్టుకునే 'వేకువలో చీకటిలో'

కర్నూలు కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కేవీఆర్ మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం (మీరాబాయి) రచించిన 'వేకువలో చీకటిలో' కథల సంకలన పాఠకుల హృదయాన్ని సున్నితంగా స్పృశిస్తాయి. సుమారు 37 కథలతో ఈ పుస్తకాన్ని ఆమె ఎనిమిది పదుల వయస్సులో ప్రచురించారు. ఆమె ఎనిమిదో కథా సంకలనం ఇది. 1963లో మొదలైన ఈమె కథా రచన నేటికీ కొనసాగుతూనే ఉంది. కేవీఆర్ మహిళా కళాశాల్లో ఆంగ్లోపన్యాసకురాలిగా పదవీ విరమణ చేసిన మీరాబాయి ఇప్పటి వరకు 200పైగా కథలు, ఒక నవల, మూడు నవలికలు రాశారు. మధ్యతరగతి జీవితాలను, మానవీయ విలువలను ఇతివృత్తాలుగా చేసుకొని, మన చుట్టూ జరిగే సంఘటనలను సరళంగా, క్లుప్తంగా, మనసును తట్టేలా, మానవ సంబంధాలను పటిష్టపరిచేలా రచన చేశారు. జీవన వైవిధ్యాలను, విరుద్ధ మనస్తత్వాలను ఆమె లోతుగా చిత్రించడం ఆమె ప్రత్యేకత. మధ్య తరగతి స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆధునిక భావజాలం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత, కరోనా కాలంలో ఎదురైన సంక్లిష్టతలు ఇలా అనేక ఇతివృత్తాలు ఇందులో ఉన్నాయి.


పదవీ విరణ తర్వాత కుటుంబంలో జరిగే పలు సంఘటనల వల్ల మనశ్శాంతిని కోల్పోయి నిరాశతో బతుకులు వెళ్లదీసే వయోవృద్ధులు.. చివరికి సేవను పరమావధిగా ఎంచుకునే ఇతివృత్తంతో 'నలుగురి కోసం' కథ రాశారు. జీవితంలో అన్నీ దక్కినా ఉద్యోగ విరమణ తర్వాత కలిగిన నిర్వేదం వల్ల నిరాశా నిస్పృహలతో కుంగిపోతున్న నీరజ, ఉన్నంతలోనే సంతృప్తిగా బతుకుతున్న లలితమ్మను స్ఫూర్తి పొందుతుంది. ఈ కథ పేరు 'జీవితం జీవించడానికే'.

రెండు రోజులు తిండిలేకుండా ఆకలితో అల్లాడిపోతున్న సుందరానికి ఆబ్దికాలకు వెళ్లి రెండుసార్లు భోజనం చేసే అవకాశం వస్తుంది. అయితే ఆకలితో ఎండుకుపోయిన పేగుల్లో తిన్న ఆహారం ఇమడలేక వాంతులై జబ్బుపడతాడు. ఆ స్థితిలో కూడా తనకు వచ్చిన దక్షిణను మరో పేదవాడి చదువుకు వెచ్చిస్తాడు. ఈ ఉదాత్త సంఘటన కేంద్రంగా రాసిన కథ 'ఆపద్ధర్మం'. ఈ సంపుటి శీర్షిక 'వేకువలో చీకటిలో' అనే కథలో ఆ ఇంటి ఇల్లాలే నిత్యం బండెడు చాకిరీ చేస్తున్నా తన కష్టాన్ని ఏమాత్రం గుర్తించకుండా, చిరాకుపడుతూ, అవహేళనగా మాట్లాడే భర్తను భరిస్తూ ఉంటుంది. పెళ్లయిన కొత్తల్లో అతను రాసిన ఉత్తరాల్లో చూపిన ప్రేమను గుర్తుచేసుకొని, పరిస్థితుల ప్రభావంతో మారిన భర్త ధోరణి అర్థం చేసుకుంటుంది. రాజీమార్గంలో పయనిస్తూ సంసారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో కష్టమైనా, సుఖమైనా నాకు నువ్వు, నీకు నేను అనుకుని భర్తను ఆదరిస్తుంది. ఇలా అనేక కథలు పాఠకుల గుండెను తట్టిలేపే విధంగా, ఆలోచనాత్మకంగా సాగుతాయి. అచ్చ తెలుగు పదాలను మాత్రమే ఎక్కువగా వినియోగిస్తూ అన్ని వర్గాలు చదువుకునే విధంగా రచయిత్రి శైలిని ఎన్నుకున్నారు. ఈ కథల్లోని సంఘటనలు, ఎదురయ్యే పాత్రలన్నీ పాఠకులకు తమ జీవితంలో ఎక్కడో తారసపడినట్లుగా అనిపిస్తాయి. పుస్తక విక్రయ కేంద్రాల్లో ఈ కథా సంపుటి లభిస్తుంది.



- డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, కర్నూలు

గుర్తుకొస్తున్నాయి...!



లోకజ్ఞానమే తెలియని బాల్యంలో
బరువు, బాధ్యతలు కనపడని ఆ లేత వయసులో
పచ్చని పొలాల గట్లపైన చేసిన సందడి
పంట కాలువలో చేప పిల్లలా కొట్టిన కేరింతలు..

ఆకలి మరచిన కడుపుతో వీధి మూలల్లో
మూగిన జతగాళ్లతో ఆడిన గోలీలాటలు
గెలుపు కోసం చేసే విశ్వ ప్రయత్నాల్లో
జార్చిన చెమట చుక్కల మధ్య వరించిన
ఆకలిని కూడా జయించిన విజయానందం
ఇవన్నీ మదిని మురిపించన ఆనాటి మధురానుభూతులు..!

ఎగరేసిన పతంగులు
ఎండిన పొలాల్లో కబడ్డీ
చింత తోపుల్లో
కోతికొమ్మచ్చి
బడి గోడలను ఎగిరి
దూకిన దాగుడు మూతలు..

అమ్మ పెట్టే చద్దన్నం
నాన్న కొనిచ్చే పప్పిమెంటు బిళ్ల
స్నేహితుడు కొరికి ఇచ్చిన కాకి ఎంగిలి
భుజాలపై వేసుకునే చేతుల వంతెన
ఎంత బలమైన బాల్యపు బంధమో కదా..?
ఇప్పుడేదీ ఈ కాంక్రీట్ జంగిల్‌లో అంత పటిష్టమైన అనుబంధం..?

బాల్యం ఒక మరుపురాని అనుబంధం
బాల్యం ఒక చెరిగిపోని జ్ఞాపకం...
బాల్యం చివరి మజిలీ వరకు గుండెల్లో
ఉండిన వెలుగు నీడ
బాల్యం ప్రతి ఒక్కరికీ జీవిత సత్యాన్ని
నేర్పే గొప్ప అడుగు జాడ



- ఎం. రాజశేఖర్, కర్నూలు

నాగేశ్వరయ్యకు 'తెలుగు కీర్తి' పురస్కారం



కర్నూలు కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కవి, రచయిత, కళాకారుడు కేవీ నాగేశ్వరయ్య విజయవాడలోని శ్రీశ్రీ కళావేదిక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 21న విజయవాడలోని శ్రీకౌతా పూర్ణానంద విలాస్ సమావేశం హాలులో కళావేదిక ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. తెలుగు బాషా పరిరక్షణ, తెలుగు వైభవం చాటుకునే దిశగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష కృషి చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పురస్కార గ్రహీత కేవీ నాగేశ్వరయ్య తెలిపారు. ఇప్పటి వరకు వైదిక రత్న తదితర పురస్కారాలు అందుకున్న తాను ఇటీవల విడుదలైన 'సీతారాం సిత్రాలు' అనే తెలుగు సినిమాలో తండ్రి పాత్రలో నటించినట్లు తెలిపారు. తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక పట్ల నాగేశ్వరయ్యను పలువురు కళా, సాహితీవేత్తలు అభినందించారు.

నగరంలో నేడు

- రానున్న రిపబ్లిక్ డే పురస్కరించుకుని ఆదివారం ఉదయం 7:30 గంటలకు జడ్పీ కార్యాలయం నుంచి కొండారెడ్డి బురుజు వరకు 2కే మారథాన్ రన్' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బి.మహావీర్, నిఖిల్‌గౌడ్, చిరంజీవి తెలిపారు. మారథాన్‌లో పాల్గొనే వారు తెల్లటి టీషర్టులు ధరించి రావాలని సూచించారు.
- నగరశివారులో మామిదాలపాడులోగల గోదా రంగనాథస్వామి (గోదా గోకులం) దేవస్థానానికి ఆదివారం ఉదయం 8 గంటలకు అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి బృందం రాక.
- గోదారంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో ధనుర్మాస ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీగోదా రంగనాథుల వైభవ కల్యాణం నిర్వహి స్తున్నా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో నిత్య కల్యాణం పచ్చతో రణం పూజాది కార్యక్ర మాలకు శ్రీకారం చుడుతున్నట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు.
- కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు 'కనకపుష్య రాగం' సాంఘిక నాటకం ప్రదర్శన ఉంటుంది. విజయవాడకు చెందిన సీనియర్ సినీ నాటక రంగ నటుడు ఎస్కే మిశ్రో దర్శకత్వం వహిస్తున్న ఈ నాటకం అనేక చోట బహుమతులు గెల్చుకుందని కన్వీనర్లు డి.ఈశ్వరయ్య, యాగంటీశ్వరప్ప తెలిపారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

సాహితీ స్రవంతి ఒక చారిత్రక అధ్యాయం

- రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి
- చారిత్రక నవల 'చతురిత' ఆవిష్కరణ
- నగరంలో సంస్థ కార్యాలయం ప్రారంభం



సాహితీవేత్తలతో కలిసి చతురిక నవలను ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి



కర్నూలు కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య చరిత్రలో సాహితీ స్రవంతి సంస్థది చారిత్రక అధ్యాయమని, ప్రగతిశీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడంలో స్రవంతి విశేష కృషి చేస్తోందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తెలక పల్లి రవి అన్నారు. శనివారం ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కృష్ణనగర్‌లోని నరసింహయ్య నివాసంలో ఆయన చిత్రపటానికి సాహితీ వేత్తలు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు పుష్ప మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడుతూ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నరసింహయ్య నివాసంలో సాహితీ స్రవంతి సంస్థ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక విశ్లేషకుడు, గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి పరిశోధనాత్మక సేకరణ, 108 ఏళ్ల నాటి కర్నూలు నవల 'చతురిక'ను ఆవిష్కరించారు. ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షత వహించగా, తెలకపల్లి రవి మాట్లాడుతూ ఉయ్యాలవాడ రామచంద్రరావు నూట ఎనిమిది ఏళ్ల క్రితం చతురిక నవల రాశారని, ఈ నవల 1917లో కర్నూలులో అచ్చయిందని అన్నారు. అయితే చతురిక చరిత్రకెక్కని నవలగా ఉండిపోయిందని అన్నారు. కర్నూలు కేంద్రంగా అనేక సాహిత్య ఉద్యమాలను తమ నివాసం నుంచే నడిపామని ఆయన గుర్తు చేసుకున్నారు. సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలకు ఎంతో చేయూతనిచ్చిన తమ తండ్రి నరసింహయ్య ఆశయాలకు పునరంకితం అవుతామని అన్నారు. కేసీ కల్కూర మాట్లాడుతూ సాహిత్య చరిత్రలో కర్నూలు ప్రాంతానికి విశిష్టమైన స్థానం ఉందని, ఎంతోమంది స్వాతంత్ర సమరయోధులు, చరిత్రకారులు గొప్ప సాహిత్యాన్ని అందించారని అన్నారు. వనం శంకరశర్మ, గాడిచర్ల సర్వోత్తమరావు వంటి ప్రముఖులు సాహిత్యానికి విశేష కృషి చేశారని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ సాహితీ స్రవంతి కార్యాలయం సాహిత్య, సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ మాట్లాడుతూ చతురిక నవల కర్నూలు సాహిత్య చరిత్రను మలుపు తిప్పుతుందని అన్నారు. ఈ నవల మీద ఇంకా చాలా పరిశోధన జరగాల్సి ఉందని అన్నారు. కెంగార మోహన్ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి కర్నూలు జిల్లాకు విశిష్టస్థానం ఉందని అన్నారు. కార్యక్రమ సమన్వయకర్త, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ నరసింహయ్య ఇంటితో తనకు 45 ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు. ఈ సభలో సాహితీవేత్తలు నాగేశ్వరాచారి, మారుతి పౌరోహితం, ఇనాయతుల్లా, సయ్యద్ జహీర్ అహ్మద్, ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదనానికి ప్రతిరూపం ఎన్టీఆర్

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సోమిశెట్టి, టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదనానికి నిలువెత్తు రూపం నందమూరి తారక రామారావు అని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో నైతిక విలువలు పాటిస్తూ, పేదవాడి అభివృద్ధిని ఆకాంక్షించిన రాజకీయ నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. టీడీపీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా అవకాశం కల్పించి వారి ఎదు గుదలకు కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. అంతటి గొప్ప వ్యక్తికి భారత రత్నతో గౌరవించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల పరిమళభరిత పద్యాలు



కైరవి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయతలు

ఘనంగా కైరవి పుస్తకావిష్కరణ

నంద్యాల (కల్చరల్), జనవరి 18: చల్లని వెన్నెల వెలుగు పరిమళాలను మధుసూదన్ తన పద్య కృతి కైరవిలో ఆవిష్కరించారని కళారాధన ప్రధాన కార్యదర్శి డా. రవికృష్ణ పేర్కొన్నారు. శనివారం పింగళిసూరన శాఖా గ్రంథాలయంలో గణిత ఉపాధ్యాయుడు, కవి మధుసూదన్ రచించిన కైరవి ఖండకావ్య పుస్తకావిష్కరణ సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా కవులు, రచయితలు, పాఠకులు, అతిథులు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలర్పించారు. అనంతరం కైరవి పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. రవికృష్ణ మాట్లాడుతూ వచన కవిత్వం వైపు కవులు మొగ్గుచూపుతున్న సమయంలో సరళమైన పద్యాలను అద్భుతమైన సందేశాలతో మధుసూదన్ రాసి పాఠకలోకాన్ని అలరించారన్నారు. 41 ఛందో వైవిధ్యాలతో నవరసభరితంగా కైరవి పుస్తకాన్ని తెలుగు సాహితీలోకానికి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డా. వెంకటరమణమూర్తి, అన్నెం శ్రీనివాసరెడ్డి, డా. గంగుల నాగరాజు, డా. నీలం వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి శ్రీధర్, మధు, కవులు మాబుబాషా, నరేంద్ర, శేషఫణి, డా. కిషోర్, ప్రసాద్, నీలకంఠమాచారి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

- 29 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు
- పెద్దతుంబళం జడ్పీ పాఠశాలలో పాత రోజులు



అప్పటి ఉపాధ్యాయులతో పెద్దతుంబళం పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆదోని రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'హాయ్ రా.. ఎలా ఉన్నావ్. ఏం చేస్తున్నావ్... నిన్ను చూసి చాలా కాలమైందిరా. చాలా మారిపోయావ్.. ఎంత మంది పిల్లలు, వాళ్లేం చదువుతున్నారు. నాడు తరగతిలో వీడు అలా చేశాడు.. ఇలా చేశాడు' అంటూ ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల పలకరింపులు ఇవి. గత మధుర జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. ఆదోని మండలం పెద్దతుంబళం జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు. ఆ పాఠశాలలో 2001-02 సంవత్సర బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శనివారం పాఠశాలలో ఒకచోటకు చేరారు. 29 ఏళ్ల తర్వాత కలిసిన వారు.. గత అనుభూతులు, చేసిన అల్లరిని గుర్తు చేసుకుని మునుపటి రోజులకు వెళ్లారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి మంచి హోదాల్లో పనిచేస్తున్న వీరంతా స్నేహితులతో ఆనందంగా గడిపారు. అప్పటి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యాబుద్ధులు నేర్పిన వారి పాదాలకు నమస్కరించి ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ ప్రాణ స్నేహితులతో కలసి ఇలా రోజంతా గడపడం చాలా ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులతో కలసి భోజనాలు చేశారు. ఇదిలా ఉండగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, తెలుగు పండిట్ ఎర్రమ పాండురంగయ్య 'గుర్తుకొస్తున్నాయి.. ఆనాటి పాత రోజులు భలే..భలే.. అలనాటి జ్ఞాపకాలు ఎంతో మధురం..' అంటూ పద్యరూపంలో పాడిన పాట ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ ఈరన్న, ప్రధానోపాధ్యాయులు అయ్యాళప్ప, ఉపాధ్యాయులు రంగన్న, లక్ష్మీ నారాయణ, రవీంద్ర లాల్, ముజాబుర్, రెహమాన్, పూర్వ విద్యార్థులు అల్లావుద్దీన్, ఖాలీద్ బాష, రమేష్, అంజినమ్మ, సుజాత, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ భాషను మరువొద్దు



మాతృభాష తెలుగును ఎవరూ మర్చిపోకూడదు. తెలుగు భాషలో ఉన్నంత మాధుర్యం మరే భాషల్లోనూ లేదు. వృత్తి, ఉద్యోగరిత్యా ఇతర భాషలు నేర్చుకున్నప్పటికీ నేటితరం పిల్లలకు తెలుగు భాషకు ఉన్న ఖ్యాతిని తెలియజేయాలి. ప్రతి విజయం వెనుక స్త్రీమూర్తి ఉంటారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా వారి ప్రోత్సాహం అనిర్వచనీయం. ఇన్నేళ్ల తర్వాత కూడా విద్యార్థులు కలసిమెలసి ఉండటం చాలా ఆనందంగా ఉంది.

- ఈ. పాండురంగయ్య, రిటైర్డ్ హెచ్ఎం



రిటైర్డ్ హెచ్ఎం పాండురంగయ్యను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నిరాశ్రయులకు నీడ

- ఆకాశమంత అప్యాయతను పంచే సంఘమిత్ర
- 60 మంది విద్యార్థులకు ఆశ్రయం ఇస్తున్న సంస్థ
- నేడు 31వ వార్షికోత్సవం

కన్నవారికి దూరమైన పిల్లలకు అమ్మ ప్రేమను పంచడానికి ఎవరో ఒకరు ముందుకు రావాలి. ఏ చేయూత లేని వారికి ఆదరువై అప్యాయతనందించే ఆకాశమంత పెద్ద మనసు ఉండాలి. ఇవన్నీ సంతరించుకున్న సంఘమిత్ర సేవా సమితి నిరాశ్రయ బాలలను అక్కున చేర్చుకుంటున్నది. తల్లిదండ్రులలాగే బాధ్యతతో, ప్రేమాభిమానాలతో పాటు మంచి చెడు, నైతిక విలువలు, దేశభక్తిని బోధించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నది. బడుగు, బలహీన, అణగారిన పేద ప్రజలకు తోడుగా ఉంటూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి వారికి సమాజంలో గౌరవాన్ని కల్పిస్తూ కనీస అవసరాల తీరుస్తున్నది. నేడు 31వ వార్షికోత్సవం జరుపుకోనున్న సంఘమిత్ర సేవా సమితిపై ప్రత్యేక కథనం..

నంద్యాల కల్చరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరాశ్రయ బాలల కోసం ఆగస్టు 15, 1994న నంద్యాల పట్టణంలో కేవలం నలుగురు అబ్బాయిలతో చిన్న బాడుగ గృహంలో సంఘమిత్ర సేవా సమితి ఏర్పడింది. పట్టణంలో ఎంతో మంది సేవాపరులు అందించిన ఆర్థికసహాయంతో ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ ఇప్పుడు సొంత గృహంలో 60 మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తున్నది.



సంఘమిత్ర ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

1995 నుండి ఇప్పటి వరకు ఎన్నో రక్తదానశిబిరాలను ఏర్పాటు చేసి, ఎంతో మంది విలువైన ప్రాణాలు కాపాడింది. మురికి వాడల్లో, గ్రామాలలో వైద్యసేవలను అందిస్తున్నది. క్షయ వ్యాధి నివారణ కోసం లక్ష రూపాయల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నది. బండిఆత్మకూరు, వెలుగోడు మండలంలోని చిన్నస్వామి గూడెం, నెమలుల కొండ, ఒంటిగుడిసె తాండ, చెంచుకాలనీలు, ఇలా పలు చెంచు గూడెంకు చెందిన గ్రామాలలోని ప్రజలకు దుస్తులు, దుప్పట్లు, అలాగే రోగులకు ఉచిత వైద్యసేవలు, మందులు అందిస్తున్నది. ప్రతి సంవత్సరం దాదాపు 12000 మంది చెంచులకు వైద్య సహాయం అందిస్తోంది.

- అమ్మాయిలకు విద్యతో పాటు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం నిర్వహించి కుట్టుమిషన్లు ఇస్తోంది. చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను ఇస్తోంది. కొత్తపల్లి గ్రామంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తోంది. విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్లు నడుపుతోంది.
- బాలబాలికలకు ముగ్గులపోటీలు, మెహందీ శిక్షణా కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దేశనాయకుల జన్మదినం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహిస్తోంది

సంఘమిత్ర నన్ను తీర్చిదిద్దింది



నాపేరు రంగంరెడ్డి మహేశ్వరరెడ్డి. తల్లిదండ్రులు లేని నన్ను సంఘమిత్ర అక్కున చేర్చుకుని ప్రేమ, అప్యాయతలు అందించింది. నేనే సంఘమిత్రలో మొదటి విద్యార్థిని. సంఘమిత్ర వ్యక్తిగా నన్ను తీర్చిదిద్దింది. ఎంకామ్ వరకు చదువుకున్నాను.

- రంగంరెడ్డి మహేశ్వరరెడ్డి(పీజీ), ప్రైవేటు ఉద్యోగి

సమాజ సేవలో సంఘమిత్ర



సమాజసేవలో సంఘమిత్ర నిరంతరం అందరి సహాయ సహకారాలతో పనిచేస్తున్నది. సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించి విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన భావి భారత పౌరులుగా తీర్చి దిద్దుతోంది.

-చిలుకూరి శ్రీనివాస్, కార్యదర్శి

వలస వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం



కోల్‌మాన్ పేట గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఈవో

కోసిగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వలస వెళ్లకుండా స్థానికంగానే పనులు కల్పిస్తామని కోసిగి మండల ప్రత్యేక అధికారి, డీఈవో శ్యామ్యూల్ పాల్ అన్నారు. వలసలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు వారు స్పందించారు. ఈ మేరకు శనివారం మండలంలోని దుద్ది, కోల్‌మాన్‌పేట, వందగల్లు, ఆర్లబండ, అగసనూరు తదితర గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. చదువుకునే పిల్లల్ని వెంట తీసుకెళ్లి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. బడి ఈడు పిల్లలకు అన్నం పెట్టి చదివిస్తామని దుద్ది, కోల్‌మాన్‌పేట గ్రామాల్లో అవగాహన కల్పించారు. స్థానికంగా పనులు లేకపోవడం, ఉపాధి పనులు కూలి డబ్బులు తక్కువగా వస్తుండటంతో వలస పోతున్నామని పలువురు వాపోయారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుల్లో కనిపించని మద్దతు ధర

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో గిట్టుబాటు ధర దక్కుతుందనే ఆశతో రైతులు పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకువస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మాత్రం వారికి అందడం లేదు. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్న కర్నూలు మార్కెట్ యార్డులో శనివారం రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు అందలేదు. మధ్యస్థ, కనిష్ఠ ధరలు మరింతగా పతనమై పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేరుశనగ కాయలకు ప్రభుత్వం క్వింటానికి రూ.6,720 మద్దతు ధరను ప్రకటించింది. అయితే శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర రూ.6,216, మధ్యస్థ ధర రూ.4,940, కనిష్ఠ ధర రూ.3,116 మాత్రమే అందింది. కందులకు మద్దతు ధర రూ.7,600 ధరను ప్రకటించింది. ఈ కందులకు మార్కెట్ యార్డులో కొంత వరకు మద్దతు ధర అమలైంది. గరిష్ఠ ధర రూ.8,001, మధ్యస్థ ధర రూ.7,089, కనిష్ఠ ధర రూ.3000కు అమ్ముడుపోయినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఉల్లిగడ్డలకు వారం రోజులుగా ధర పెరుగుతూ వస్తుంది. గరిష్ఠ ధర రూ.2,651, మధ్యస్థ ధర రూ.2,389, కనిష్ఠ ధర రూ.1237 దక్కింది. ఎండుమిరప కాయలకు గరిష్ఠ ధర రూ.14వేలు, మధ్యస్థ ధర రూ.11,709, కనిష్ఠ ధర రూ.4,409 దక్కింది. కొర్రలకు గరిష్ఠ ధర రూ.3,011, మధ్యస్థ ధర రూ.2,619, కనిష్ఠ ధర రూ.1,813 దక్కింది. మినుములకు గరిష్ఠ ధర రూ.8,109, మధ్యస్థ ధర రూ.2,619, కనిష్ఠ ధర రూ.1,813 దక్కింది.

పొగాకు షెడ్లు దగ్ధం


పూర్తిగా కాలిబూడిదైన పొగాకు షెడ్డు

గడివేముల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైబోగుల గ్రామంలో పొగాకు షెడ్లు దగ్ధమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పైబోగుల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య 4 ఎకరాల్లో, సూర్య వెంకటేశ్వర్లు 2.50 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారు. పంట కోసి పొగాకు ఎండబెట్టే క్రమంలో ఈశ్వరయ్య 4 షెడ్లు వేశారు. సూర్య వెంకటేశ్వర్లు 3 షెడ్లు వేసి పొగాకు నిల్వ చేశారు. శుక్రవారం రాత్రి షెడ్డులో మంటలు చెలరేగి పొగాకు దగ్ధమవుతుందని స్థానికులు చెప్పడంతో బాధితులు చేరుకున్నారు. మంటలను ఆర్పాలని ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. పొగాకు పూర్తిగా దగ్ధమైంది. ఈశ్వరయ్యకు రూ.7 లక్షలు, సూర్య వెంకటేశ్వర్లుకు రూ.5.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిందా?, గుర్తు తెలియని వ్యక్తులు షెడ్లకు నిప్పంటించారా? అని బాధితులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామన్నారు.

నిందితుల అరెస్టు


నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

చిప్పగిరి, జనవరి18 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని బంటనహాళ్ గ్రామంలో ఈ నెల 13న రామాంజినేయులు, తలారి సురేష్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్టు చేశారు. పత్తికొండ డీఎస్పీ బి.వెంకట్రామయ్య శనివారం మధ్యాహ్నం స్థానిక చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. తలారి సురేష్‌తోపాటు మరో ఆరుగురిని శనివారం ఏరూరు-గుమ్మనూరు వై జంక్షన్ వద్ద ఆలూరు సీఐ వెంకటచలపతి, చిప్పగిరి ఎస్సై సతీష్ కుమార్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో అరెస్టు చేశామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ బాషా, ఖాదర్ భాషా, భాస్కర్, రామోజీ, తిప్పన్న, గురుప్రసాద్ పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

ఆస్పరి, జనవరి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టకలమర్రి గ్రామానికి చెందిన బాలుడు రాజేష్ (6) నీటి కుంటలోపడి శనివారం మృతి చెందాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. రాజు, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజేష్, చిన్న కుమారుడు విష్ణు. రాజేష్ ఒకటో తరగతి చదువుతున్నాడు. సెలవులు ఉండటంతో తల్లిదండ్రులు పొలానికి తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమై ఉండగా, రాజేష్ స్నేహితులతో కలిసి ఆడుకుంటుంటూ పొలంలోని నీటి కుంటలోకి జారి పడ్డాడు. స్నేహితులు తల్లిదండ్రులకు చెప్పడంతో బయటకు తీశారు. బాలుడిని ఆదోని ఆసుపత్రికి, అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.


రాజేష్ (ఫైల్)

పూర్తిస్థాయి సేవలు ప్రారంభించాలి

- అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు
- స్టేట్ కేన్సర్ హాస్పిటల్ తనిఖీ


స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంఈ

కర్నూలు హాస్పిటల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి మొదటి వారంలో కర్నూలు స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తిస్థాయి సేవలు అమలు కావాలని అడిషనల్ డీఎంఈ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాకె. వెంకటేశ్వర్లు, స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా. కృష్ణప్రకాష్‌తో కలిసి కేన్సర్ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. కేన్సర్‌హాస్పిటల్‌కు ఆక్సిజన్, జనరేటర్లు, సివిల్ వర్క్‌లను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌ను ఆదేశించారు. ఆక్సిజన్ పైపులైన్‌ను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

ఎట్టి పరిస్థితుల్లో ఫిబ్రవరిలో కేన్సర్ రోగులను అడ్మిషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేన్సర్ హాస్పిటల్‌కు కర్నూలు జీజీహెచ్ నుంచి 10 మంది హెడ్ నర్సులు, 40 మంది స్టాఫ్ నర్సులు, 20 మంది శానిటేషన్, 10 మంది సెక్యూరిటీ సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్, వైద్య విద్యార్థులు పీజీ, ఎస్ఆర్‌లను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీ రావు, కేన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సర్దుబాటు చేయడానికి వచ్చారా?

రూ.120 కోట్లతో ఏర్పాటు చేసిన స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం పూర్తయింది. కొన్ని పరికరాలు ఇంకా హాస్పిటల్‌కు చేరలేదు. ఆక్సిజన్ పనులు ప్రారంభం కాలేదు. లిఫ్టు, వెంటిలేటర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో శనివారం స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌కు అడిషినల్ డీఎంఈ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు వచ్చారు. అందరూ కేన్సర్ హాస్పిటల్‌కు నిధులు తీసుకుని వచ్చారా అంటూ అందరూ వైద్యులు అనుకున్నారు. అడిషనల్ డీఎంఈ మాత్రం నిధుల గురించి ఏ మాత్రం చెప్పకుండా కర్నూలు జీజీహెచ్ నుంచి సిబ్బంది, వైద్య విద్యార్థులు పరికరాలను సర్దుబాటు చేయాలని చెప్పడం అందరినీ విస్మయానికి గురి చేసింది. వైద్య విద్యార్థులు పీజీ, ఎస్ఆర్, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులు, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని కర్నూలు జీజీహెచ్ నుంచి సర్దుబాటు చేయాలని ఆదేశించడంతో సర్వజన వైద్యశాలపై పడుతుంది. పోస్టులు భర్తీ చేయకుండా పరికరాలు తెప్పించకుండా సివిల్ వర్క్‌కు నిధులు ఇవ్వకుండా తూతూమంత్రంగా కేన్సర్ హాస్పిటల్‌లో ఐపీ రోగుల సేవలు ఎలా ప్రారంభిస్తారని కొందరు వైద్యులు చర్చించుకుంటున్నారు. కర్నూలు జీజీహెచ్‌కు ప్రతిరోజు 3వేల మంది ఓపీ రోగులు వస్తుంటారని, ఇక్కడున్న సిబ్బంది పరికరాలను కేన్సర్ హాస్పిటల్‌కు పంపిస్తే దీని ప్రభావం కర్నూలు పెద్దాసుపత్రికి వచ్చే రోగులపై తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. సేవలు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాయలసీమకు వరప్రసాదినిగా ఉన్న స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు నిధులు విడుదల చేసి, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని రోగులు కోరుతున్నారు.

డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి


మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే డా. వి. పార్థసారథి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధుల వరద కురిపిస్తోందని వివరించారు. శనివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమమని చెప్పిన మాట నేడు నిజమవుతోందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను పక్కదారి పట్టించి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని అన్నారు. ఫలితంగా ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన తీర్పు ఇచ్చారని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ ఉక్కును కాపాడుటం కోసం కేంద్రం నుంచి రూ.11400 కోట్లను సమకూర్చి ప్రాణం పోశారన్నారు. 4.2 శాతం ఉన్న ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 7.02 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. అంతేకాకుండా బ్యాంకులోని రుణాలను తీర్చడంతో పాటు గనులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

రాయలసీమ ప్రాంతంతో పాటు అన్ని జిల్లాలోని గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేస్తామన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత అభివృద్ధి మొదలైందన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అవుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తున్నాయని వివరించారు. జలజీవన్ మిషన్, అమృత్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి ఇచ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీఎస్ నాగరాజు, సీనియర్ నాయకులు డాక్టర్ కొట్టె చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్, బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి పీటీ. సాయప్రదీప్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- నంద్యాల కలెక్టర్ రాజకుమారి



నంద్యాల (కల్చరల్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రారంభించిందని, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈనెల 21వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పోర్టల్ పీఎంఇంటర్న్‌షిప్. ఎంసీఏ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పిస్తామన్నారు. వన్‌టైం గ్రాంట్ కింద రూ.6 వేల రూపాయలతో పాటు ప్రతినెల రూ.5 వేలు స్టైఫండ్ చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీసీఏ, బి.ఫార్మసీ తదితర గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలన్నారు. వివరాలకు 6300324076, 8297812530 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మానసిక వికలాంగులకూ హక్కులు ఉన్నాయి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూల లీగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరితో పాటు మానసిక వికలాంగులకూ హక్కులు ఉన్నాయని, వారి కోసం పలు చట్టాలు ఉన్నాయని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల ప్యానెల్ న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లకు స్థానిక న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మేధో వైకల్యాలు ఉన్న వ్యక్తులకు సంబంధించిన సేవల పథకాలు ఉన్నాయని, ఈ పథకాలను తమ చట్టాలను ఉపయోగించుకుని మానసికంగా బాధపడేవారు అభివృద్ధి చెందవచ్చని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పలు చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శిక్షకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శివరామచంద్రరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటి మెంబరు కె.వెంకటరమణయ్య, అసిస్టెంట్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రేవతి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల్లో తాత్కాలిక నియామకాలపై ఆరా

- రేపటిలోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం
- విశ్వవిద్యాలయ అధికారుల గుండెల్లో దడ

కర్నూలు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్శిటీల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా వర్శిటీ అధికారులు చేపట్టిన నియామకాలపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వాటిపై ఈనెల 20 లోపు నివేదికలు ఇవ్వాలని అన్ని వర్శిటీల ఇన్‌చార్జి ఉపకులపతులు, రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాదిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా పలు వర్శిటీల్లో తాత్కాలిక ఉద్యోగులను నియమించారు. అలాగే కోర్టు కేసులతో ముడిపడి ఉన్న సమస్యల్లో భారీ ఎత్తున ముడుపులు దండుకుని పోస్టులు కట్టబెట్టారనే ఫిర్యాదులను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఈనెల 20లోపు అన్ని వర్శిటీలు నివేదికలు ఈ మెయిల్ ద్వారా పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టిన ఆర్థిక లావాదేవీల వివరాలను పంపాలని పేర్కొంది. దీంతో జిల్లాలోని 3 వర్శిటీల్లో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిపిన అధికారుల్లో ఆందోళన మొదలైంది. రాయసీమ యూనివర్సిటీలో 26వ పాలక మండలిలో డిస్మిస్ చేసిన ఓ ఫైనాన్స్ అధికారిని తిరిగి నియమించాలని ఆర్‌యూ అధికారులు కోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు వెళ్లడం లాంటి సంఘటనలు జరిగాయి. వీటిని పరిగణలోకి తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌చార్జిల ఉపకులపతుల పాలనల్లో వర్శిటీల్లో జరిగిన లావాదేవీలు, నియామకాలపై ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిందని కొందరు ప్రొఫెసర్లు చర్చించుకుం టున్నారు.

సత్తా చాటిన పెద్దకొట్టాల వృషభాలు

జాతరలో కొనసాగుతున్న ఎద్దుల బలప్రదర్శన



ప్రథమ స్థానంలో నిలిచిన వృషభాలు

ఎమ్మిగనూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు జాతరలో ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగుతు న్నాయి. నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శనివారం న్యూ కేటగిరి విభాగంలో కర్నూలు, నంద్యాల ప్రాంతాల నుంచి 8 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో 4,625 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలను కైవసం చేసుకున్నాయి. అలాగే నందవరం మండలానికి చెందిన జింకల మహేష్ వృషభాలు 3,900 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.40వేల నగదును గెలుచుకోగా, నంద్యాల జిల్లా మల్యాల గ్రామానికి చెందిన షేక్‌మహమున్ని వృషభాలు 3,707.11 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.30వేల బహుమతిని సాధించాయి. గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు చెవిటి సుంకన్న వృషభాలు 3,650 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.20వేలు, నంద్యాల జిల్లా పి.రుద్రవ రానికి చెందిన యల్లారెడ్డి వృషభాలు 3603.4 అడుగుల దూరం లాగి ఐదో బహుమతి రూ.10వేలను గెలుచుకు న్నాయి. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదుతో పాటు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. పోటీల సందర్భంగా వ్యాఖ్యాతలుగా చిరంజీవి, మిమిక్రి ఆర్టిస్ట్ హెచ్ కైరవాడి ఉస్మాన్ అలరించారు. పీఈటీ లక్ష్మన్న బండలాగుడు దూరాన్ని కొలిచారు. మొదటి బహుమతిని ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేంద్ర బాబు, సభ్యులు అందజేయగా మిగతావి అధికారులు, నిర్వాహకులు అందజేశారు. భాస్కర్, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, రాళ్లదొడ్డి మురళికృష్ణారెడ్డి, గురురాజాదేశాయ్, గోనెగండ్ల సీఐ గంగాధర్, నందవరం ఎస్ఐ వి.శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు, పట్టణ ఎస్ఐ డాక్టర్ నాయక్‌లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

● వర్ధంతిని నిర్వహించిన టీడీపీ నాయకులు ● రక్తదాన శిబిరాల ఏర్పాటు ● సేవా కార్యక్రమాల నిర్వహణ


బండి ఆత్మకూరులో..


నందికొట్కూరులో రక్తదాతకు పండ్లు, జ్యూస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


నందికొట్కూరు రూరల్: మల్యాలలో నివాళి అర్పిస్తున్న చిన్నవెంకటస్వామి


నంద్యాలలో రక్తదానం


ఆత్మకూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి


జూపాడుబంగ్లా : పోతులపాడులో..


పగిడ్యాల: బీరవోలు గ్రామంలో..


మహానందిలో..

నంద్యాల రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని బొమ్మలసత్రంలోని ఎంపీ బైరెడ్డి శబరి నివాసంలో దివంగత సీఎం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథరెడ్డి, బైరెడ్డి దినేష్, అజయ్ ఆధ్వర్యంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు.

ఆత్మకూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు ఆద్యుడు దివంగత నందమూరి తారకరామారావేనని కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగా రెడ్డి, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంచర్ల గోవింద రెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ అన్నారు. శనివారం దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరులోని గౌడ్ సెంటర్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో తెలుగు తమ్ముళ్లు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. నాయకులు వై.యుగంధర్‌రెడ్డి, సి.కలీముల్లా, అబ్దుల్లాపురం బాషా, నాగూర్‌ఖాన్, కొండలరావు, గౌస్ లాజం, శివశంకరశర్మ, మల్లికార్జునరెడ్డి, రామ్మూర్తి, జనసేన నాయకులు శ్రీరాములు, సుబ్బరాజు ఉన్నారు.

మహానంది: మహానంది సమీపం లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ మండల కన్వీనర్ మధు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జిలు జనార్దన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, శివ, క్రాంతికుమార్‌తో పాటు నాగపుల్లయ్య, కంచెర్ల శివ, పాణ్యం ప్రసాదరావు, మల్లిఖార్జున, గని, చిన్న రంగస్వామి, కృపావరం, చెన్నయ్య పాల్గొన్నారు.

బండిఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు సేవలు మరువలేనివి అని టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ భరద్వాజ శర్మ, కంచర్ల మనోహర్‌చౌదరి, జాకీర్, ఏసీ లింగారెడ్డి అన్నారు. బండిఆత్మకూరు బస్టాండ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెద్దదేవళాపురం, వెంగళరెడ్డిపేట, జీసీపాలెం, నారాయణపురం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధం తిని నిర్వహించారు. మల్లేశ్వరరెడ్డి. వడ్డు మధుసూదన్‌రెడ్డి, బి.సుబ్బారెడ్డి, సర్పంచ్ రామ చంద్రుడు, నాగ శేషారెడ్డి, శివప్రసాద్, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరావు, నందయ్య, సిద్ధయ్య, భూపాల్, బాలుడు, సాయిబాబారెడ్డి, మాధవరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులోని తెలుగు గంగ జలాశయం వద్ద ఎన్టీఆర్ విగ్రాహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే టీడీపీ కార్యాలయంలో వర్ధంతి నిర్వహించారు. టీడీపీ నాయ కులు అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్ జాకీర్ హుస్సేన్, హంజా, అమీర్ అలీఖాన్ సుదాకరరెడ్డి, జనసేన నాయకులు శాలుబాషా తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: ఎన్టీఆర్ వర్ధంతిని మండలంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. పోతులపాడులో సర్పంచ్ నిర్మలమ్మ, టీడీపీ నాయకులు శివానందరెడ్డి తదితరులు పాల్గొని ఎన్‌టీఆర్ చిత్రపటా నికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పాణ్యం: దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని శనివారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాణ్యంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గడివేముల: మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, దుర్వేసి గ్రామంలో పాణ్యం నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జమాల్ బాషా, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

నందికొట్కూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్టీ, ఎస్సీల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన మహానేత దివంగత నందమూరి తారక రామారావు అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని టీడీపీ నాయకులు, బాలకృష్ణ అభిమానులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, మండలాధ్యక్షులు పలుచాని మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు జాకీర్, ధర్మారెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, వీరం ప్రసాద్‌రెడ్డి, షకీల్ అహ్మద్, ముర్తుజావలి, సురేంద్ర, వేణుగోపాల్, లాయర్ జాకీర్, జనార్దన్, గిరీశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవి, బీజేపీ నియోజకవర్గ నాయకుడు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.


మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాహీద్ హాజరై నివాళులర్పించారు.

● ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వాడి జాతి గౌరవాన్ని ఇనుమడింపజేసిన మహానేత నందమూరి తారక రామారావు అని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో కాకరవాడ చిన్న వెంకటస్వామి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వృద్ధులకు అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు చాంద్‌బాషా, రావూఫ్, ఇతర నాయకులు ఉస్మాన్, వీఆర్ శ్రీను, ముజుబుర్ రెహమాన్, శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: తెలుగు జాతి కీర్తిని నలుమూలలా చాటిన గొప్ప వ్యక్తి నందమూరి తారక రామారావు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, సీనియర్ నాయకుడు తరిగోపుల నాగేశ్వరారావు అన్నారు. మల్యాల గ్రామంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం రక్త దాన శబిరంలో రక్తదానం చేశారు.

పగిడ్యాల: ప్రాతకోట గ్రామంలో టీడీపీ నాయకుడు నాగశేషులు, బీరవోలులో మాజీ జడ్పీటీసీ చిమ్మె బిచ్చన్న ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు ఉసేన్‌సాహెబ్, జయరాఘవ నాయుడు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, మిద్దె శ్రీనివాసులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. వెంకటేశ్వర రెడ్డి, నాగేంద్ర, శేషి రెడ్డి, వీరా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో ఎన్టీఆర్ 29వ వర్ధంతిని తెలుగు యువత మండల అధ్యక్షుడు మధుకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నంద్యాల కార్యదర్శి జయమ్మ, చంద్రశేఖరరావు, వెంకటేశ్వర్లు, మహేశ్వర రావు, గురునాథ్, మద్దిలేటి, నూరుల్లా, శ్రీనివాసులు, శివ, మైనార్టీ నాయకులు ఉస్మాన్‌బాషా, వీరేశ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


గడివేములలో..


పాణ్యంలో..


పాములపాడులో..


మిడుతూరులో..


వెలుగోడులో..

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పగిడ్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మాపురం గ్రామానికి చెందిన తూర్పాటి భూపాల్ (40)అనే వ్యక్తి గుండెపోటుతో శనివారం మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు భూపిగౌడ్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మద్యం ధ్వంసం

నంద్యాల క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఏఈఎస్ రాముడు పర్యవేక్షణలో నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేశారు. 30 డీపీఎల్ కేసుల్లోని 126లీటర్ల మద్యం, 9 ఐడీ కేసుల్లో పట్టుబడిన 154లీటర్ల నాటుసారాను పంచాయతీ దారుల సమక్షంలో నాశనం చేశారు. నంద్యాల ఎస్‌హెచ్‌వోలు, ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ

నంద్యాల రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం ఏడీఆర్ డాక్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు, సిబ్బందికి శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. డీఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఆరుతడి పంటలతో అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. శనగలో కొత్త రకమైన ఎన్‌బీఈఎఫ్- 810 రకం రైతుల మన్నలను పొందిందని చెప్పారు. అనంతరం ఏడీఆర్ మాట్లాడుతూ తెగులు ఉధృతి అధికం కాకుండా మూడేళ్లకోసారి శనగ జేజీ-11 రకం సాగు చేయాలని సూచించారు. వివిధ పంటల సరళి, వర్షాపాతం గురించి కర్నూలు ఇన్‌చార్జి డీఏవో అరుణకుమారి వివరించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నంద్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికై నిర్వహించే అర్హత పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ అధికారులు కేటాయించారు. జిల్లాలో 2152 మంది విద్యార్థులకు గానూ 384మంది గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను డీఈవో సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.

ఏఐఐఎంఎస్‌లో 29వ ర్యాంకు


విజ్ఞాన్ తరుణ్

నంద్యాల రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన రైతు కడియం జనార్దన్, మాణిక్యమ్మ కుమారుడు విజ్ఞాన్ తరుణ్‌కు న్యూరో డీఎం ఫిజీషియన్ కోర్సులో ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 29వ ర్యాంక్ సాధించారు. గ్రామస్థాయి నుంచి వెళ్లి జాతీయ స్థాయిలో గ్రామానికి మంచి పేరు తీసుకురావడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

నంద్యాల కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా నంద్యాల జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం శాంతిరాం మెడికల్ కళాశాల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. డీటీవో ఐశ్వర్యారెడ్డి, ఎంవీఐ శ్రీకాంత్, శాంతిరాం మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ విష్ణువర్దన్ రెడ్డి, నస్మా, అంజనీ బార్గవి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం సాయంత్రం విశాఖపట్టణానికి చెందిన టి.లలితా శ్రీనివాస్ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. రెండో కార్యక్రమంలో భాగంగా సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ తిరుపతి బృందంతో నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసింది. కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

కొలను భారతిలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పురోహితులు కుంకుమార్చన, పుష్పార్చన, సహస్ర నామార్చన, సప్త శివాలయాల్లో శివునికి అభిషేకాది క్రతువులు నిర్వహించారు. అలాగే క్షేత్ర సన్నిధిలో 14 మంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షర బీజాక్షర క్రతువులు చేయించుకున్నారు. భక్తులకు స్థానిక ఆర్యవైశ్య సత్ర నిర్వహకులతో పాటు శివపురం గ్రామ శివారులో ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

మహానందిలో భక్తుల రద్దీ


పూజలు చేస్తున్న భక్తులు

మహానంది, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం శనివారం భక్తులతో కిట కిటలాడింది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఇందులో భాగంగా ఆలయం ప్రాంగణంలోని కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. రెండు రోజుల పాటు మహానందిలో భక్తుల రద్దీ ఉండే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

గోస్పాడు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జేసీ విష్ణుచరణ్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్ర మంలో భాగంగా ఆయన శనివారం గోస్పాడు సచివా లయం, ఎంపీడీవో కార్యాలయాల ప్రాంగణాలలో మండల అధికారులతో కలసి చెత్తాచెదారం తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం ఈ కార్య క్రమం చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో మొక్కలు పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ఎంపీడీవో అమానుల్లా, ఎంపీపీ అర్షద్ సైమన్, తహసీల్దారు షేక్ మొహిద్దీన్, ఈవోఆర్డీ నాగఅనసూయ, సర్పంచ్ ప్రమీల పాల్గొన్నారు.



గోస్పాడులో ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ, అధికారులు


అయ్యలూరులో ర్యాలీ

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులోని తిక్కయ్యస్వామి దర్గా వద్ద రోడ్లను శుభ్రం చేసి పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కోఆప్షన్ సభ్యుడు ఎంఎ రషీద్, నాయకులు అబ్దుల్లాపురం బాషా, హరిప్రసాద్, మొహబతుల్లా తదితరులు ఉన్నారు.

● తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్లు ఆంజినేయులు, మనోహర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆత్మకూరు రూరల్: బైర్లూటి గూడెంలో స్వచ్ఛ ఆధ్ర.. స్వచ్ఛ దివస్‌ను నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కాంతారావు నాయక్, బైర్లూటి వైద్యాధికారి గోపాల్, సర్పంచ్ గురువమ్మ, పంచాయతీ కార్యదర్శి చాణక్య, స్టాఫ్ నర్స్ తులసి, ఆరోగ్య సిబ్బంది విశ్వనాథ్, సోమేశ్వరి పాల్గొన్నారు.

మహానంది: మహానంది క్షేత్రంలో శనివారం స్వచ్ఛ సేవా కార్యక్రమంను ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, అధికారులు, టీడీపీ నాయకులు గడ్డం నాగపుల్లయ్య, కంచెర్ల శివతో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరం పరిశుభ్రత పాటిద్దామని ఎంపీడీవో దస్తగిరి, టీడీపీ నాయకులు మనోహర్ చౌదరి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి సూచించారు. శనివారం బండిఆత్మకూరులో స్వచ్ఛ ఆంధ్ర, సచ్ఛ దివస్ కార్యక్రమాన్ని సర్పంచ్ సంధ్య ఆధ్వర్యంలో కార్యదర్శి అక్బర్ చేపట్టారు. మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్, తహసీ ల్దార్ పద్మావతి, డాక్టర్లు భావనరెడ్డి, సరిత, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, ఏఈ వెంకటరాముడు, ఏపీవో వసుధ, వీఆర్వోలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఈవోఆర్డీ మురారీ, ఆర్‌డబ్ల్యుయస్ జయపాల్‌రెడ్డి ఈవో సుంకన్న టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్, జాకీర్ హుస్సేన్, హంజా, స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు

పాణ్యం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని పాణ్యం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ పల్లవి, ఎంపీపీ ఉశేన్‌బీ, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్, ఎంఈవోలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఏపీఎం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, పొదుపు మహిళలు, మోడల్ పాఠశాల విద్యార్థులు, పీఈటీ కిరణ్‌కుమార్‌రెడ్డి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: ప్రతిపల్లె శుభ్రంగా, సుందరంగా ఉండాలని నంద్యాల మండల ప్రత్యేకాధికారి, డీఈవో జనార్దన్‌రెడ్డి సూచించారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో ర్యాలీతో పాటు శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్ ఓబులేసు, తహసీల్దార్ ప్రియదర్శిని, ఎంపీడీవో సుగుణశ్రీ, ఎంఈవో బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: నంద్యాల డీపీఈవో రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం డీపీఈవో కార్యా లయం, నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏఈఎస్ రాముడు, నంద్యాల ఎస్‌హెచ్‌వో కృష్ణమూర్తి, ఈఎస్ టీఎఫ్ సీఐ లక్ష్మణ్‌దాస్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు: మన ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణ పరిరక్షణలో నియోజకవర్గ ప్రజలందరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ బేబి, నందికొట్కూరు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రబ్బాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళి అర్పించారు. పట్టణంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. హాజరైన వారితో పరిసరాల పరిశుభ్రతపై ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, జాకీర్, ధర్మారెడ్డి, చాంద్‌బాషా, లాలు ప్రసాద్, బీజేపీ నాయకుడు దామోదర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ముర్తుజావలి, మహేశ్వర్‌రెడ్డి, నంది కొట్కూరు మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, సీడీపీవో కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాలలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య, ఎంఈవో మురళీమోహన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరులో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుశేన్, ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ జయలక్ష్మమ్మ, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, ఏవో సురేష్, హౌసింగ్ ఏఈ భాస్కర్, ఎంఈవో ఫైజున్నీసా, ఏపీఎం సుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడు బంగ్లాలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఏపీఎం అంబమ్మ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఉమారాణి, గుమ్మడాపురం సర్పంచ్ విజయకుమార్, డీటీ పెద్దన్న, ఉప సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ నిర్వహించారు. సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ పఠాన్‌బాబు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారి జవహర్‌బాబు, ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుట్రదారులను బయటపెట్టాలి



మాట్లడుతున్న టీడీపీ నాయకులు

డోన్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్‌పై జరిగిన హత్యాయత్నంలో కుట్రదారులను బయటపెట్టడానికి పోలీసు అధికారులు కేసులో లోతుగా సమగ్ర విచారణ జరపాలని డోన్ టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. కోట్రికే హరికిషన్ మాట్లాడుతూ హత్యాప్రయత్నంలో నిందితులుగా ఉన్న సోమేష్ యాదవ్ కుటుంబానికి తనకు ఎటువంటి కక్షలు లేవన్నారు. నెహ్రూనగర్‌లో సోమేష్ యాదవ్ సోదరుడు శేఖర్ ఇంటికి మున్సిపల్ అధికారు లు నోటీసులు ఇవ్వడానికి సిద్ధమై ఇంటిని పడుగొడుతారనే విషయం అవాస్తవమన్నారు. మున్సిపల్ అధికారులు సోమేష్ యాదవ్ సోదరుడు ఇంటికి ఇంత వరకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. వాటి వెనుక తన ప్రమేయం ఉందన్న ప్రచారం అవాస్తవమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్ మాట్లాడుతూ కోట్రికే హరికిషన్‌పై జరిగిన హత్యాప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోట్రికే ఫణిరాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటనాయునిపల్లె శ్రీను, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్యగౌడు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముస్తక్ అహ్మద్

చాగలమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో 10 విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముస్తక్ అహ్మద్ తెలిపారు. శనివారం చాగలమర్రిలోని 5వ సచివాలయాన్ని తనిఖీ చేసి వివిధ రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో 33 హాస్టళ్లు ఉన్నాయని, 4 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. 400 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారని అన్నారు. జిల్లాలో 33 హాస్టళ్లకు 27 సొంత భవనాలు ఉండగా 6 వసతి గృహాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. సొంత భవనాల స్థలాల కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. 27 మంది వార్డెన్‌లకు గాను 15 మంది హాస్టల్ వార్డెన్‌లు మాత్రమే ఉన్నారని అన్నారు. ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదించామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ తాహిర్‌హుసేన్ పాల్గొన్నారు.

టీఏ, ఎఫ్ఏలకు షోకాజ్ నోటీసులు

చాగలమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు టీఏలు, ముగ్గురు ఎఫ్ఏలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఉపాధిహామీ ఏపీడీ సాంబశివరావు తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల బస్టాండు సమీపంలో రైతులు ఏర్పాటు చేసుకున్న మినీ గోకులాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చాగలమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఉపాధి హామీ పీడీ జనార్దన్‌రావు అన్నారు. శనివారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలో 864 మినీ గోకులాలు మంజూరయ్యాయని, వాటిలో 290 మినీ గోకులాలు పూర్తయ్యాయని అన్నారు. జిల్లాలో 75 లక్షల మంది ఉపాధి కూలీలకు పనిదినాలు లక్ష్యం కాగా 59.42 లక్షల మందికి ఉపాధి పనిదినాలు కల్పించామని, మార్చి చివరి నాటికి మిగిలిన పనిదినాలు కల్పించాల్సి ఉందని అన్నారు. 2.16 లక్షల మందికి జాబ్‌కార్డులు పంపిణీ చేశామన్నారు. 40 శాతం మంది కూలీలకు 100 పనిదినాలు కల్పించామని అన్నారు. మార్చి చివరి నాటికి పనిదినాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సామాజిక తనిఖీలో అవినీతికి పాల్పడిన ఉపాధి సిబ్బందికి నోటీసులు అందిస్తామని అన్నారు. మస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. చాగలమర్రి మండలంలో 60 శాతం మాత్రమే కూలీలకు పనిదినాలు కల్పించారని అన్నారు. సమావేశంలో ఏపీడీ సాంబశివరావు, ఏపీవో నిర్మల పాల్గొన్నారు.



బేతంచెర్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



చాగలమర్రిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



డోన్‌లో తారక రామనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

మహనీయుడు ఎన్టీఆర్

● ఘనంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి

బనగానపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేసి రాజకీయంగా ఎదుగుదలకు కృషి చేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బనగానపల్లెలో వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టిన ఘనత దేశంలో మరెవరికీ లేదన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రికార్డు స్థాయిలో కోటి మందికి పైగా సభ్యత్వం చేసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నా రు.

చాగలమర్రి: దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. శనివారం చాగలమర్రి న్యూబిల్డింగ్స్ వీధి లో 4వ ఎంపీటీసీ జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌలాలి, అజీమ్, జల్సాగౌస్, జెట్టి సురేష్, ప్రసాద్, సుధాకర్, ఉసేన్‌సా, వెంకటయ్య, టైలర్ ఖాదర్, గాంధీ, మహమ్మద్, రియాజ్, సుబ్రహ్మణ్యం, బికారి, నరసింహా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మార్కెట్‌యార్డుచైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమడాల మద్దిలేటి, జగదీశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు అని డోన్ నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని తారక రామనగర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కోట్ల రాఘవేంద్రరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిరంలో 200 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, కోట్రికే హరికిషన్, వెంకటనాయునిపల్లె శ్రీను, టీఈ కేశన్నగౌడు, శేషఫణిగౌడు, పెద్దకేశవయ్యగౌడు, సీలం భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

డోన్ రూరల్: డోన్ పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, ప్యాపిలి మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, ప్యాపిలి గండికోట రామసబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టి శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్, ఎస్ మధు, గండికోట పెద్దరామాంజినేయులు, నాగేంద్ర, గండికోట ర మేష్, వెంకటేష్, సూరి, సుధాకర్, చంద్రశేఖర్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన పోలూరు టీడీపీ కార్యాలయంలో పోలూరు రాఘవ అధ్యక్షతన ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, మేకల నాగరాజు, పోలూరు రాఘవ, చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, రుద్రవరం కృష్ణుడు, పోలూరు శ్రీనివాసులు, మురళికృష్ణ, రామ్మోహన్, జావాజి వెంకటేశ్వర్లు, శేషశైనారెడ్డి, ఆపతి ప్రతాప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : బనగానపల్లె పట్టణంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తెలుగు యువత కార్యక ర్తలు తరలివెళ్లారు. తెలుగు యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాదు, పోరెడ్డి చిన్నపురెడ్డి తదితరులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు రక్తదాన శిబిరంలో పాల్గొని, రక్తదానం చేశారు.



ప్యాపిలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు



డోన్ ఎంఎస్‌ఆర్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కోవెలకుంట్ల టీడీపీ కార్యాలయంలో..



బేతంచెర్ల టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఘనంగా బీసీ ఇందిరమ్మ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని శ్రీనయ్య కార్యాలయం వద్ద టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టంగుటూరు శ్రీనయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సంగు శ్రీనివాసరెడ్డి, నాగేంద్రారెడ్డి, తిరుమలయ్య, బాస్కర్‌రెడ్డి, సుధాకర్, బాలరాజు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. శనివారం తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాదు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో కేకు కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపాడు శివరామిరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, నిమ్మకాయల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

450 గ్రామ పంచాయతీలలో ఆడిట్ పూర్తి

చాగలమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పరిధిలోని 479 పంచాయతీలు ఉన్నాయని, వాటిలో 450 పంచాయతీల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించి జరిగిన ఆడిట్‌లో 450 పంచాయతీలు పూర్తి చేశామని డీఏవో స్రవంతి తెలిపారు. శనివారం చాగలమర్రి మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆడిట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. జిల్లాలో 15 మేజర్ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. ప్రతి ఏడాది ఆయా పంచాయతీలలో ఆడిట్ చేసి నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఏవో లలిత, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ పాల్గొన్నారు.

నరసింహయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

బేతంచెర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యమ నేత తెలకపల్లి నరసింహయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం బేతంచెర్ల పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం కార్యాలయంలో కార్యదర్శి మధుశేఖర్ అధ్యక్షతన తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సభను నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్ మద్దిలేటి స్వామి, హరిప్రసాద్ శెట్టి, శ్రీనివాసులు, ఎస్‌ఏ కలాం, భాస్కర్, బాషా, నాయుడు, నారాయణ, కుల్లాయప్ప, సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ మెట్ట వద్ద వెలసిన అభయ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి అభిసేకం చేసి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.2.64 లక్షలు

బేతంచెర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.2.64 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక. ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.2,64,020ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రికి తాగునీటి ట్యాంకు విరాళం

బేతంచెర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న అల్లాబకాష్ దర్గా సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సౌకర్యార్థం వాటర్ ట్యాంకును లయన్స్ క్లబ్ అధ్యక్షులు సూరా మధు సుధాకర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రియాంకకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వలిబాషా, విష్ణు, కేశాల్‌నాయుడు, శ్రీను పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో మందుల కొరత లేదు

● జిల్లా వైద్యశాఖ అధికారి వెంకటరమణ



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటరమణ

కొలిమిగుండ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేదని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం కొలిమిగుండ్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించి, రక్త పరీక్షల గది, మందుల గది, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రిలో సిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నా, రోగులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆసుపత్రిలో లభించే మందులు, సేవలు, సౌకర్యాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల పట్ల కూడా మహిళలకు అవగాహన పెంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డా. హరిచరణ్‌రెడ్డి, డా. నాగజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ గణేష్, సుదర్శనరెడ్డి తదితరులు ఉన్నారు.

కళ్ల పట్ల జాగ్రత్తగా ఉండండి

డోన్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తమ కళ్ల పట్ల డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీవో క్రాంతి కుమార్ సూచించారు. శనివారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీవో కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 76 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. వాహనాలు నడిపే సమయంలో కంటి చూపు సమస్యలు ఉండకూడదన్నారు. తమ కళ్ల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.



ఉయ్యాలవాడ: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



చాకరాజువేముల: స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



అవుకు: ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో, అధికారులు



సంజామల: రోడ్డును పరిశుభ్రం చేస్తున్న అధికారులు



టంగుటూరు: ర్యాలీని నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పల్లెల స్వచ్ఛత అందరి బాధ్యత

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా జిల్లాను స్వచ్ఛ నంద్యాలగా తీర్చిదిద్దుతామని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి నెలా 3వ శనివారం న్యూ ఇయర్- క్లీన్ స్టార్ట్ అన్న థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌ను నిర్వహించుకుంటున్నామన్నారు. రాష్ట్రం, జిల్లాలు, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



చాగలమర్రి: శ్రమదానం చేస్తున్న అధికారులు, సచివాలయ ఉద్యోగులు



బేతంచెర్ల: శ్రమదానం చేపట్టిన అధికారులు



శిరివెళ్ల: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవో ఇతర అధికారులు



ప్యాపిలి: బస్టాండ్ ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు



రుద్రవరంలో మానవహారంగా...



బనగానపల్లె: కాపుల పల్లెలో ర్యాలీ..